# గొడుగు వెల ఎంత?

వి. యస్. చెనార్రి

ఇహ వొచ్చేది వర్షాకాలం. చేత గొడుగు లేకుండా ఇల్లు వొదలడానికి లేదు. ఉన్న వొక్క గొడుగూ పాడయిపోయింది. ఎలాగయినా ఒహ గొడుగు కొనుక్కోక పోతే ముందు ముందు చాలా ఇబ్బంది పడాలిసివుంటుంది'— అని అనుకొంటూనే రోజులు గడుపుతున్నాడే కాని, పర్సులోంచి డబ్బు పైకి తీయాలంటే మనసొప్పింది కాదు రంగయ్యగారికి.

తొలకరి చినుకులు పడ్డం ప్రారంభించినై. వొకటి రెండు దఫాలు చాలా యిబ్బంది పెట్టిం తరువాతగాని, రంగయ్యగారికి తెగింపు కలిగింది కాదు. పర్సు జేబులో వేసుకుని, గబగబా బజారుకు వెళ్లాడు. బజారంతా గాలించి, ఓ దుకాణంలో, ఓ జింకమార్కు బోలు కమ్మీల గొడుగు పదిరూపాయలకి బేరం చేశాడు. ఇంతలో తనతోబాటు బేరం చెయ్యడానికి వొచ్చిన ఓ పెద్దమనిషి—'మద్రాసులో అయితే దీని ఖరీదు ఏ ఏడో—ఎనిమిదో వుంటుంది' అని చెప్పడంతో, వృధాగా రెండో మూడో అంగడివాడికి వొదులుకునేందుకు మనసొప్పలేదు రంగయ్యగారికి.

'ఎలాగూ వొచ్చే ఆదివారం నాడు మద్రాసు వెళ్లాలిసిన పనుంది. అమ్మాయికి పెళ్లి. పువ్వులూ, పళ్ళూ మొదలయిన సామాన్లు పట్టుకురావాలి. ఈ వారంరోజులూ యెలాగో కళ్లుమూసుకు గడిపేస్తే, మద్రాసులోనే కొనుక్కోవచ్చు.' అనుకొన్నాడు.

అనుకున్నట్టే వారంరోజులూ గడిచిపోయినై. ఆదివారం ఉదయం బండికి మద్రాసు ప్రయాణమయ్యాడు.

రంగయ్యగారు మద్రాసులో పెళ్ళికి కావలసిన సామానంతా కొనుక్కున్న తరువాత, మరిచిపోకుండా, గొడుగు లకం పెనీకి బయలుదేరాడు. చైనాబజారు, దేవరాజ మొదలివీధీ, రతన్ బజారూ అన్నీ గాలించి, చివరికి, ఓ దుకాణంలో జింకమార్కు బోలుకమ్మీల గొడుగుని బేరం చేసి, ఎనిమిదిరూపాయలకి ఇహ సెటిల్ చేసుకోబోతాడనగా, పక్కన బేరం చేస్తున్న ఆసామీతో, అతని స్నేహితుడు —'మౌంటురోడ్డులో 'ఫలానా' షాపులో క్రిందటివారం తాను అదే గొడుగు ఏడురూపాయలకే ఖరీదు చేసినట్టు' చెబుతోండగా రంగయ్యగారి చెవినిబడింది. వెంటనే, చేతిలోని గొడుగక్కడ పడేసి, చరచరా బస్సుస్టాపింగ్‌కు దారితీశాడు. ఇంతలో బస్సుకయితే రెండణాలిచ్చుకోవాలనీ, ట్రాముకయితే అణాన్నరతోనే పోవొచ్చుననీ, జ్ఞాపకంరాగా, గిరుక్కున వెనక్కితిరిగి ట్రాంస్టాపింగ్‌లో నుంచున్నాడు.

ట్రాము క్రిక్కిరిసిన జనంతో —స్థూలకాయుని మల్లే రోజుకుంటూ వొచ్చి ఆగడం; దాని చుట్టూ జనం ఈగలకు మల్లే ముసురుకోడం; రంగయ్యగారు ఫైల్‌మాన్‌కు మల్లే గోచీబిగదీసి, జనంలోదూరి, కసరత్తుచేసి ఎలాగో ఎక్కి నుంచోడం జరిగింది. ట్రాము కదిలింది. జనం తొక్కిడిలో జేబుదొంగలుంటారన్న సంగతి ఆయనకి బాగా తెలుసు. అంచేతనే తనకి కావలసిన చిల్లరడబ్బులు తప్ప జేబులో మరేమీ వుంచుకోలేదు. మిగతా డబ్బంతా సరమానవుడి కంటబడకుండా దాచివుంచాడు. పోతూపోతూన్న ట్రాముకి, సహం దూరం వెళ్లేసరికి కిర్రుమని బ్రేకు పడిపోయింది. "ఏవిటి సంగతి"— అని విచారించగా ముందు, లైనుమీద ఒక ట్రాము యేవో చిన్న రిపేర్స్‌వల్ల ఆగిపోయిందనీ,— త్వరలోనే అది కదలవొచ్చునీ— లైను క్లియర్ కాగానే తమ ట్రామూ కదుల్తుందనీ తెలిసింది.

ఇదిగో పోతుంది- అదిగో పోతుంది, అంటూనే అరగంట దాటిపోయింది. ట్రాములోంచి జనం వొక్కొక్కరుగా దిగిపోతున్నారు. అణాన్నర డబ్బులు పెట్టి టికెట్టు కొనుక్కున్న తరువాత ట్రాముని వొదిలి వెళ్లాలంటే మొదట రంగయ్యగారికి మనసొప్పింది కాదు.

రంగయ్యగారు రిస్టువాచీ చూచుకున్నారు. ఏడయిపోయింది. ఇహ మెయిలుకి గంటన్నరమాత్రమే వుంది. లగేజి ఆఫీసులో ఎవరో ఎరిగిన వాళ్లుంటే సామాను ముందుగానే స్టేషన్లోకి చేర్చేశాడు కాబట్టి, త్వరగా వెళ్లితే మౌంటురోడ్డులో గొడుగు కొనుక్కుని వొచ్చేందుకు వ్యవధిలేకపోలేదు. కాని, ట్రాము కదిలేట్టులేదు.' చివరికి రంగయ్యగారు ట్రాం ఆశ వొదలుకుని క్రిందికి దిగారు.

ఆ లైన్లో అన్ని ట్రాములూ ఆగిపోవడం మూలాన బస్సుల్లో స్థలం దొరకడం కష్టంగావుంది. రిక్షాలూ జట్కాలూకూడా చాలా రద్దీగా వున్నయ్. పాపం, ఎంత ప్రయత్నించినా రిక్షాగానీ, జట్కాగానీ చిక్కనే లేదు. ఇలా మరో అరగంట దాటిపోయింది. ఇహ వుండేదే గంట వ్యవధి. ఈ గంటవ్యవధిలో మౌంటురోడ్డు వెళ్లిరావడం వీలుపడదు. అందుచేత రంగయ్యగారు మౌంటురోడ్డు ఆశ వొదలుకోవలసి వొచ్చింది. సెంట్రలుకయినా బస్సు చిక్కుతుందేమో నని ప్రయత్నించాడు. కాని, అదీ వృథా ప్రయాసకాగా, పాపం, కాలినడకనే వెళ్లడానికి నిశ్చయించుకున్నాడు. ఆపాటికి మరో అరగంట దాటిపోయింది. ఇహ వున్న వ్యవధల్లా అరగంటమాత్రమే! పాపం రంగయ్యగారికి అసలే నడవడం అలవాటు లేదు. పైగా భారీశరీరం. అందులో తొందరగా వెళ్ళాలి. ఏం చేస్తాడు? పాపం, రొప్పుకొంటూ, రొజుకొంటూ, చెమటలు కార్చుకొంటూ రోడ్డు రోలర్‌కి మల్లే తారురోడ్డు మీద దొర్లడం ప్రారంభించాడు. ఏం దొర్లినా ఏం ప్రయోజనం? నడక సాగితే నా? తీరా ఆయనగారు స్టేషన్ చేరుకునేసరికి, అప్పుడే మెయిలు పొగలు కక్కుతూ ప్లాట్‌ఫారం వొదులుతోంది. ఆ దృశ్యం చూచేసరికి రంగయ్యగారి గుండెలు గబుక్కున ఆగిపోయినై.

రంగయ్యగారు మెయిల్లో వెళ్లకపోతే ఇంటిదగ్గర ఎక్కడపన్లక్కడే ఆగిపోతాయి. తెల్లవారుఝామున జరగాల్సిన ముహూర్తం ఆగిపోవొచ్చు. అక్కడివాళ్లు ఆందోళన పడిపోతారు. నలుగుర్లో నామోషీ కూడాను. అదీకాకుండా, పెళ్ళి సందర్భానికి కొన్న వందరూపాయల పువ్వులూ వృథా అయిపోతాయి. పాపం, ఆయనగారికి ఏం చెయ్యడానికీ తోచలేదు. ముచ్చెమటలు పోశాయి. పార్సెల్ షెడ్డులో రంగయ్యగారి నెరిగిన మనిషి వున్నాడని చెప్పానుగా, అతగాడు - యేదేనా టాక్సీ ఎంగేజ్ చేసుకోమని సలహా యిచ్చాడు.

పాపం, ఉన్న ఒక్క ట్రెయినూ దాటిపోయింది. బస్సులూ లేవు. ఇహ నేం చేస్తాడు? టాక్సీని ఎంగేజ్ చేసుకోవడంకంటే గత్యంతరం లేకపోయింది.

అవసరానికి అందరూ గిరాకీ చేస్తారు. అందులో అపరాత్రివేళ. ఏపాతికో ముప్ఫయ్యో అడిగేవాడల్లా యాభై రూపాయలు డిమాండు చేశాడు టాక్సీవాడు. ఏంచేస్తాడు పాపం? ఎలాగో బేరం చేసి, నలభైరూపాయల కొప్పించి తన సామానుతోబాటు తానూ కార్లో పడ్డాడు. పాపం, ఇల్లు చేరుకునేదాకా రంగయ్యగారి మనసు మనసులో లేదు.

టయిముకి ఇల్లు చేర్చినందుకు ఓ వేపు టాక్సీడ్రైవర్ని అభినందిస్తూ, వృథాగా నలభై రూపాయలు వాడి కివ్వవలసివొచ్చినందుకు మరోవేపు విచారిస్తూ కుర్చీలో చతికిలబడ్డాడు.

ఇన్నింటికీ కారణం తన పీనాసితనమేనన్న విషయం జ్ఞాపకానికి రాగానే పాపం, రంగయ్యగారికి చెడ్డసిగ్గేసింది. తాను కార్లో రావలసి వొచ్చినందుకు కారణం ఎవరితోనూ చెప్పుకోలేదు.

దేవుడిపుణ్యాన ముహూర్తం నిర్విఘ్నంగానే జరిగిపోయింది.

మరునాటిరోజు ప్రొద్దున్నే రంగయ్యగారు పర్సు జేబులో వేసుకుని బజారుకు వెళ్లి, పదిరూపాయలు పెట్టి, జింకమార్కు జోడు కమ్మీల గొడుగు కొనుక్కుని చక్కావొచ్చాడు.

పొరిగింటి పుల్లయ్య రంగయ్యగారి గొడుగుని చూచి – "ఏం బావా? ఎంతకొన్నావ్ ఈ గొడుగుని?" అని అడిగితే, పైకి పదిరూపాయలనే చెప్పాడు కాని, అసలు ఖరీదు యాభైరూపాయలన్న సంగతి మాత్రం బయట పెట్టలేదు. ★